క్లుప్తంగా

నవోదయ పరీక్షకు 42మంది గైర్హాజరు



అలంపూర్: జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. అలంపూర్ పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో జవహర్ నవోదయ విద్యాలయాల 6వ తరగతి ప్రవేశ పరీక్షలు శనివారం నిర్వహించారు. ఎంఈఓ అశోక్ కుమార్, చీఫ్ సూపరింటెండెంట్ బాలాజీకృష్ణ కుమార్, సెంట్రల్ లెవల్ అబ్జర్వర్ మధు, నవోదయ విద్యాలయాల ప్రిన్సిపాల్ భాస్కర్‌ల ఆధ్వర్యంలో ఈ పరీక్షలు కొనసాగాయి. ఈ కేంద్రంలో 273 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 231 మంది హాజరయ్యారు. 42 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాన్ని ఫ్లెయింగ్ స్క్వాడ్ జిల్లా ఇంటర్‌మీడియట్ ఎడ్యుకేషనల్ నోడల్ ఆఫీసర్ హృదయరాజు, రూట్ ఆఫీసర్ ప్రశాంత్ భండ్ పరిశీలించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



ఉండవెల్లి: మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ శివ ప్రసాద్ తనిఖీ చేసి విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల చదువుపై ప్రత్యేక నైపుణ్యతను ఎంఈఓ శివప్రసాద్ పరిశీలించారు. ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ నేర్పించాలని, మంచి భోజనం అందించాలని ఎంఈఓ సూచించారు. విద్యార్థుల హాజరు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సమావేశం

అయిజ: మండల కేంద్రంలోని తిక్కవీరేశ్వర స్వామి ఆలయంలో ఫిబ్రవరిలో నిర్వహించనున్న జాతరను పురస్కరించుకొని ఆదివారం ఉదయం 9 గంటలకు ఆలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి వివిధ సంఘాల, పార్టీల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవాల నిర్వాహకులు, రైతులు రావాలని కోరారు.

సిల్వర్ మెడల్ సాధించిన విద్యార్థి

అయిజ: మండల కేంద్రానికి చెందిన సంజీవ ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరులో జరుగుతున్న సెవెంత్ ఇంటర్ సొసైటీ లీగ్ (ఐఎస్‌ఎల్) అండర్ 17 బాక్సింగ్ విభాగంలో సంజీవ సిల్వర్ మెడల్ సాధించాడు. కరీంనగర్‌లోని సైనిక్ స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. ఈ సందర్భంగా సంజీవ్‌కు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

350 మందికి వైద్య పరీక్షలు



ఉండవెల్లి: మండలంలోని బొంకూరులో ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శనివారం వైద్యులు బొంకూరులో క్యాంప్ నిర్వహించి ప్రజలకు రక్త పరీక్షలు, గర్భిణులకు, ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఫౌండేషన్ కోఆర్డినేటర్ నాగరాజు, వైద్యులు, సర్పంచు శ్రీలత పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలో ఆదివారం ఐఎఫ్‌టీయూ జిల్లా 3వ మహాసభలను నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహాసభలకు జిల్లాలోని కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రవి, గోపాల్, పరశురాముడు ఉన్నారు.

నోటిఫికేషన్‌పై అవగాహన

ధరూరు: పాఠశాలల యాజమాన్య కమిటీ(ఎస్‌ఎంసీ)ల నోటిఫికేషన్ శనివారం వెలువడిన నేపథ్యంలో మండల కేంద్రంతో పాటు మండలంలోని మన్నాపురం పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం యోగేందర్ మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి పాఠశాలల యాజమాన్య కమిటీల బాధ్యత కీలకమైందని, ఈ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. విధులు, బాధ్యత అనే అంశంపై వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కళాశాల ఏర్పాటు కలేనా?

- ప్రతియేటా వందల్లో ఎస్సెస్సీ విద్యార్థుల ఉత్తీర్ణత
- ఐజ, గద్వాల, కర్నూల్ పట్టణాలకు వెళ్లేందుకు దూరభారం
- ఉన్నత విద్యకు దూరమవుతున్న గ్రామీణ విద్యార్థులు



అప్పటి ఐజీ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సాధన సమితి సభ్యులు(ఫైల్)



రాజోళిలో కళాశాల కోసం నిరాహార దీక్ష చేస్తున్న సాధన సమితి సభ్యులు(ఫైల్)

రాజోళి: ఉన్నత విద్య గ్రామీణ విద్యార్థులకు అందని ద్రాక్షగా మారుతోంది. ఏపీ–తెలంగాణ సరిహద్దు మండలంగా ఉన్న రాజోళిలో విద్యార్థులకు ఇంటర్, ఆపై తరగతులకు వెళ్లేందుకు రవాణా కష్టాలు వేధిస్తున్నాయి. స్థానికంగా జూనియర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు పాఠశాల విద్యకే పరిమితమవుతున్నారు. రాజోళి మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్నప్పటి నుంచి ఇంటర్ కళాశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. మండల కేంద్రంగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా, కళాశాల ఏర్పాటు విషయం కలగానే మిగిలిపోయింది. ఈ విషయాన్ని పట్టించుకునే నాథుడే లేక విద్యార్థులు ఉన్న విద్యకు దూరమవుతున్నారు.

పెరుగుతున్న పదో తరగతి ఉత్తీర్ణత..

మండలం నుంచి ప్రతియేటా వందల సంఖ్యలో విద్యార్థులు పదో తరగతిలో ఉత్తీర్ణత సాధిస్తున్నారు. కళాశాల స్థానికంగా లేకపోవడంతో తమ పిల్లలను ఇతర ప్రాంతాలకు పంపడానికి ఆసక్తి చూపడం లేదు. మండలంలో 14 గ్రామాలు ఉండగా, మండల కేంద్రం నుంచే ప్రతియేటా 150 నుంచి 200 మంది విద్యార్థులు పదో తరగతి పాసవుతున్నారు. సగటున మండలం నుంచి దాదాపు 400 మంది వరకు పదో తరగతి పూర్తి చేస్తున్నారు. ఆపైన చదివేందుకు కళాశాల లేకపోవడంతో ఉన్నత విద్యకు దూరమవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

వేధిస్తున్న సమస్యలు..

గతంలో ఉన్నత చదువులకు కర్నూల్‌కు వెళ్లేవారు. రాష్ట్ర విభజన తర్వాత విద్యార్థులకు పలు సమస్యలు ఏర్పడ్డాయి. రాజోళి సరిహద్దులో ఉండటంతో గద్వాలకు వెళ్లాలంటే 60కి.మీ. దూరం ప్రయాణించాల్సి వస్తోంది. కర్నూల్‌కు వెళ్లాలంటే ప్రత్యేక రాష్ట్రం కావడంతో ఆసక్తి చూపడం లేదు. శాంతినగర్, అయిజ, మానవపాడు వెళ్లేందుకు గ్రామాల నుంచి సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బాలికలకు ఇంకా ఎక్కువ ఇబ్బందులు తప్పడం లేదు. ఉదయం కళాశాలకు వెళ్తే ఇంటికి తిరిగి రావడానికి రాత్రి అవుతోంది. సరైన బస్సు సౌకర్యం లేదు. సమయానికి ప్రైవేట్ వాహనాలు అందుబాటులో ఉండకపోవడంతో బాలకలను పంపేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. పరీక్షల సమయంలో గ్రామంలో విద్యార్థులు ఆటోలు మాట్లాడుకుని వెళ్లి పరీక్ష రాయాల్సి వస్తోంది. రూ.లక్షలు పెట్టి కార్పొరేట్ కాలేజీల్లో, హాస్టళ్లలో చేర్పించ లేమని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. మండల కేంద్రంలో కాలేజీ ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఇంటర్ విద్య అందుతుందని కోరుతున్నారు. కళాశాల కోసం గతంలో అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా, ర్యాలీలు చేసినా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించలేదని, ఇప్పుడైనా స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

దూరభారంతో ఇబ్బందులు



ఉన్నత చదువుల కోసం బాలికలను ఇతర ప్రాంతాలకు పంపాలంటే ఇబ్బందికరంగా ఉంటుంది. మండల కేంద్రంలో ఉంటే ఇతర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు దూరభారం తప్పుతుంది. తల్లిదండ్రులకు కూడా ఆందోళన ఉండదు.

– ఆదన్న, రాజోళి

మంత్రుల నుంచి అధికారుల వరకు..



కాలేజీని ఏర్పాటు చేయాలని గ్రామీణ, మండల అధికారులు, ఉన్నత అధికారుల వరకు సాధన సమితి తరపున వినతిపత్రాలు అందచేశాం. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే నుంచి మంత్రుల వరకు సమస్యను తీసుకెళ్లాం. కాని కదలిక రాలేదు. ప్రస్తుతం జరిగిన ప్రజాపాలనలో కూడా కాలేజీ కోసం వినతి పత్రం అందించాం. ఈ ప్రభుత్వం హయాంలోనైనా కాలేజీ ఏర్పాటు కావాలని మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు.

– ఈశ్వరయ్య, కళాశాల సాధన సమితి కన్వీనర్

ప్రతి ఒక్కరు కృషి చేయాలి

రాజోళిలో కాలేజీ ఏర్పాటు చాలా అవసరం. కాలేజీ అందుబాటులో లేక చాలా మంది ఇంటర్ విద్యకు దూరమవుతున్నారు. వందలాది మంది విద్యార్థులు పది పాసై కాలేజీ లేని కారణంగా చదువు మానేసి, పనులకు వెళ్తున్నారు. కాలేజీ ఆవశ్యకతపై గతంలో అధికారులకు, నాయకులకు వినతి పత్రాలు అందచేశాం. రాజకీయాల కతీతంగా ప్రతి ఒక్కరు మండలంలో కాలేజీ ఏర్పాటుకు కృషి చేయాలి.

– అడివి స్వామి, కళాశాల సాధన సమితి సభ్యులు, రాజోళి

భక్తులతో కిక్కిరిసిన ఆదిశిలా క్షేత్రం



ఆదిశిలా క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి వచ్చిన భక్తులతో ఆదిశిలాక్షేత్రం ఆవరణ కిటకిటలాడింది. బ్రహ్మోత్సవాలకు హాజరుకాలేని భక్తులు తమ మొక్కులు చెల్లించేందుకు వివిధ పట్టణాల నుంచి వచ్చిన భక్తులు నైవేద్యాలు సమర్పించారు. శనివారం వారాంతపు సంత కావడంతో భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ ఓటు హక్కు



అయిజలో స్పెషల్ క్యాంపెయిన్ డే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రకళ

అయిజ: అర్హులైన వారందరికి ఓటు హక్కును కల్పించేందుకు స్పెషల్ క్యాంపెయిన్ డే నిర్వహిస్తున్నామని, 18 ఏళ్లు నిండినా సరే ఇప్పటి వరకు ఓటు హక్కు లేని వారందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ చంద్రకళ అన్నారు. శనివారం మండలంలో వివిధ పోలింగ్ కేంద్రాల వద్ద నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్ డే కార్యక్రమాన్ని ఆర్డీఓ, తహసీల్దార్ షహిదాబేగం పరిశీలించారు. బీఎల్‌ఓలు నిబంధనల మేరకు పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేయాలని ఆదేశించారు. అర్హులైన వారందరూ సంబంధిత అధికారులను కలిసి ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ కేంద్రాలు పరిశీలన..

మానవపాడు: మండలంలోని మద్దూరు, అమరవాయి, కొర్విపాడు, మానవపాడు, ఏ బుర్దిపాడు, గోకులపాడు, కలుకుంట్ల చంద్రశేఖర్‌నగర్ గ్రామాల్లో శనివారం తహసీల్దార్ జుబెర్‌మొహిన్‌ద్దీన్, ఎంపీడీఓ రమణారావులు ఓటర్ లిస్ట్ నమోదు కేంద్రాల పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఆదివారం ఓటర్ లిస్ట్‌కు అవకాశం ఉందని ఓటర్ లిస్ట్ నమోదు చేసుకోని వారు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ లిస్ట్‌లో తప్పులున్నవారు ఫామ్–8 తీసుకోని సరిచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రజనీకాంత్‌రెడ్డి, బీఎల్‌ఓలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను పరిష్కరించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి

గద్వాల అర్బన్: జిల్లాలోని ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభాకు సరిపడ ఆధార్ సెంటర్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇదే అదునుగా ఆధార్ సెంటర్ల నిర్వాహకులు సైతం అధిక వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జనాభాకు అనుగుణంగా ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. జూరాల ప్రాజెక్టు, ఆర్డీఎస్ కింద ఉన్న సాగుకు అధికారులు క్రాప్ హాలీడే ప్రకటించారని, ముందస్తు సమాచారం రైతులకు ఇవ్వలేదన్నారు. పంటలతో పాటు మిర్చికి గిట్టుబాటు ధర ఇవ్వాలని, ప్రతి గ్రామపంచాయతీకి బస్సు సౌకర్యం కల్పించాలని, రేపల్లె దేవదాస్, వీవీ నర్సింహ, ఉప్పేరు నరసింహ, ఈదన్న ఉన్నారు.

అయోధ్య శ్రీరాముడి అక్షతల పంపిణీ



అమరవాయిలో అయోధ్య రాముడి అక్షతల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ధరూరు: అయోధ్య శ్రీరాముల వారి అక్షతలను మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. అందులో భాగంగానే శనివారం మండల కేంద్రంలో గ్రామ భజన మండలి సభ్యులు, భక్తులు, యువకులు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. చిన్నలు, పెద్దలు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక వైఎస్సార్ చౌరస్తా వద్ద ఈ నెల 22న ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్యలో నిర్వహించే రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ వేడుకలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇంటి వద్దే ఉండి ఉత్సవాన్ని చూ సి తరించాలని సూచించారు.

మానవపాడు: అయోధ్య రామమందిర నిర్మాణంలో భాగంగా అమరవాయి, చెన్నిపాడు, పెద్దఆముదాలపాడు గ్రామాలలో శనివారం విశ్వహిందూ పరిషత్ సభ్యులు, హిందువులు ఇంటింటికి అయోధ్య శ్రీరాముని అక్షతలను పంపిణీ చేశారు. అయోధ్య అక్షతలను శోభయాత్రగా నిర్వహించారు. శ్రీరాముని నామస్మరణ చేస్తూ పూరవీధుల గుండా ఊరేగింపుగా ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువకులు, భక్తులు, మహిళలు ఉన్నారు.

శ్రీరాముడి జెండాల పంపిణీ

అయిజ: అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శనివారం మండలంలోని సంకాపురంలో భక్తులు జై శ్రీరామ్ పేరుతో ముద్రించిన కషాయ జెండాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. మండల కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కార్యకర్తలతో కలిసి నాగ ఆంజనేయస్వామి విగ్రహాన్ని నీటితో శుద్ధిచేశారు. అయోధ్య నగరంలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని మండల కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయ సమీపంలో ఉన్న రామాలయంలో ఈనెల 22న ఉదయం సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వాములవారి ఉత్సవ విగ్రహాలతో పురవీధుల్లో శోభాయాత్ర, సాయంత్రం పల్లకీ సేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భక్తులకు మధ్యాహ్నం భోజన వసతి, సాయంత్రం అల్పాహారం వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

లెనిన్‌కు ఘన నివాళి

గద్వాల అర్బన్: దోపిడి, పీడన, అణిచివేత లేని సోషలిస్టు సమాజాన్ని ఏర్పాటు చేసిన మహానేత కామ్రెడ్ లెనిన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా కార్యాలయంలో నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి హనుమంతు మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఉప్పేరు కృష్ణ, జిల్లా కోశాధికారి జమ్మిచేడు కార్తీక్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీష్, జిల్లా ఉపాధ్యక్షుడు చందు, ప్రవీణ్ ఉన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

మానవపాడు: మండలంలోని కస్తూర్బా పాఠశాలలో శనివారం ఎస్‌ఐ రాము బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు బాల్య వివాహాలు అవగాహన లోపంతో చేసుకుంటే సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య, పోలీసులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

పిల్లలను పనులకు పంపొద్దు

మానవపాడు: బడీడు పిల్లలను పనులకు పంపరాదని, పనులకు పంపి బాలకార్మికులుగా మార్చవద్దని బాలలసంరక్షణ అధికారి రవి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా బడీడు పిల్లలు పనులకు పంపవద్దని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలను పనులకు పంపిస్తే చర్యలు తీసుకుంటామని తల్లిదండ్రులకు సూచించారు. బడీడు పిల్లలను పనులకు పంపరాదని, పనులకు పంపిస్తే 1098 సమాచారం అందించాలని తెలిపారు. కార్మికశాఖ అధికారి మోహిన్‌బాషా, హెల్ప్‌లైన్ అధికారి లక్ష్మి, హెడ్‌కానిస్టేబుల్ సుధారాణి, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

రేపు సీతారాముల కల్యాణం

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో అయోధ్య రాముల వారి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని ఈ నెల 22న సీతారాముల కల్యాణంను నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్ రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై సీతారాముల కల్యాణం చూడాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం

గద్వాల క్రైం: వ్యక్తి అదృశ్యమైన ఘటన రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్ కథనం మేరకు.. గద్వాల మండలం అనంతపురం గ్రామానికి చెందిన షరీఫ్ కొన్ని రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గతంలోను చెప్పకుండా వెళ్లి ఇంటికి వచ్చేవాడు. నాలుగు నెలలుగా తిరిగి రాలేదని, బంధువుల వద్ద వాకబు చేసినా ఫలితం లేక పోయింది. దీంతో అతని భార్య ఫాతిమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోడి పందేల స్థావరాలపై దాడి

మల్దకల్: మండలంలోని విఠలాపురం సమీపంలో కొనసాగుతున్న కోడి పందేల స్థావరాలపై శనివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ దాడుల్లో 5మంది పందెం రాయుళ్లను అరెస్ట్ చేసి రూ.6,880 నగదు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. మరో 5మంది పరార్‌లో ఉన్నట్లు ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



మైనార్టీ గురుకులాలో విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి కవిత

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించగా ముఖ్య అతిథిగా అలంపూర్ జడ్జి కమలపూరి కవిత విద్యార్థులకు అవగాహన కల్పించారు. శనివారం మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో అలంపూర్ జడ్జి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాల్య వివాహాలను నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. లైంగిక వేధింపులు వస్తే 100 పోలీస్ శాఖకు డయల్ చేయాలని పేర్కొన్నారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా చిన్నతనంలో వివాహాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవని, వారికి శిక్ష పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బాల్‌రాజు, ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ పరంజ్యోతి, కోర్టు న్యాయవాదులు, సిబ్బంది, పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్పీ డిప్యూటీ సీఈఓ ముషాహిదా బేగం

అయిజ: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం క్రమం తప్పకుండా ఇవ్వాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి ముషాహిదాబేగం అన్నారు. శనివారం మండలంలోని భూంపురంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. క్రమం తప్పకుండా మెనూ పాటించాలని, చిన్నారులను కన్న బిడ్డల్లా చూసుకోవాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థుల స్థితిగతులను పరిశీలించారు. గ్రామంలోని పారిశుద్ధ్యం పనులను పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులుతో మాట్లాడి గ్రామ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు నిబంధనల మేరకు పనిచేయాలని సలహాలు, సూచనలు చేశారు.

ఇబ్బంది లేకుండా కంది కొనుగోళ్లు చేయాలి



అలంపూర్ చౌరస్తాలో కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు నిర్వహించాలని ఎమ్మెల్యే విజయుడు అధికారులకు సూచించారు. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కంది కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయుడు, మార్క్‌ఫెడ్ సంస్థ డీఎం భాస్కర్ రెడ్డి, ఏడీఏ సక్రియా నాయక్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొబ్బరి కాయ కొట్టి కేంద్రాన్ని ఆరంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు తీవ్ర నష్టాల్లో ఉన్నారన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా బహిరంగ మార్కెట్‌లో కంటే ఎక్కువ మద్దతు ధర ఉండే విధంగా చూడాలన్నారు. గన్నీబ్యాగులు, లోడింగ్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. రైతులు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మార్క్‌ఫెడ్ డీఎం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ధరల స్థిరీకరణ నిధి పథకం ద్వారా కొనుగోళ్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఈ రోజు బహిరంగ మార్కెట్‌లో ఏ ధర ఉంటుందో కేంద్రాల్లో అదే ఉంటుందన్నారు. ప్రతి రోజు కేంద్రాల్లో ధర పట్టిక పెట్టడం జరుగుతుందన్నారు. కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు డబ్బుల చెల్లింపుల్లో జాప్యం జరగదన్నారు. రైతులు మధ్య దళారులు, మధ్యవర్తులకు అమ్మి మోసపోవద్దన్నారు. కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే రైతులకు రవాణా ఖర్చులు, మండి ఖర్చులు సైతం మిగులుతాయన్నారు. కర్ణాటక, ఏపీ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన శ్రమ తగ్గుతుందన్నారు. ధాన్యం తెచ్చే రైతులు నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలన్నారు. తేమ శాతం ఎక్కువ ఉండి ధాన్యం తెచ్చి కేంద్రాల్లో ఇబ్బందులు పడొద్దన్నారు. రైతులకు సందేహాలు ఇబ్బందులు వస్తే నా దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు గజేందర్‌రెడ్డి నాయకులు, గోపాల్‌రెడ్డి, రఘురెడ్డి, జనార్దన్‌రెడ్డి, చాంద్ బాషా, కొండన్న, రైతులు ఉన్నారు.

'మా సమస్యలు పరిష్కరించండి'

అలంపూర్: తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అగ్నిమాపక పోలీసులు ఎమ్మెల్యేను కోరారు. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కంది కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే విజయుడుని అక్కడే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన అగ్నిమాపక కేంద్రం పోలీసులు కలిసి పలు సమస్యలు విన్నవించారు. తాత్కాలిక కేంద్రం కావడంతో ఇక్కడ విధులు నిర్వహించడానికి కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు వంటి కనీస వసతులు లేకపోవడంతో ఇక్కట్లు పడుతున్నట్లు వివరించారు. ప్రధానంగా నీటి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే నీటి వసతి కల్పించడానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.



ఎమ్మెల్యే విజయుడుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

ఎమ్మెల్యేకు ఆహ్వానం..

అయిజ మండలం పులికల్‌లో ఈ నెల 22న భీరలింగేశ్వర స్వామి, పార్వతిదేవి, గణపతి, నందీశ్వర, కనకదాస్, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యేకు అందజేశారు.

ఎస్సీ ధ్రువీకరణ కోసం పోరాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న పల్లయ్య

శాంతినగర్: ఎస్సీ కుల ధ్రువీకరణ కోసం మదాసి/మదారి కురువలంతా నిరంతరం పోరాడాలని అలంపూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కురువ పల్లయ్య అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతి నగర్ కన్యకాపరమేశ్వరి ఫంక్షన్‌హాల్లో శనివారం మదాసి/మదారి కరువ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి మండల సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ముందుగా ఆవిష్కరించారు. నియోజకవర్గంలో 40 వేలకు పైగా కరువలు ఉన్నారన్నారు. ప్రభుత్వాలు కురువలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలేదన్నారు. త్వరలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి ప్రభుత్వంతో కొట్లాడి కుల ధ్రువీకరణ పత్రాలు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, పెద్ద సోమన్న, గోకారి, రాముడు, మల్లికార్జున్, ఠాగూర్ కృష్ణ, బూడిదపాడు రాముడు, చంద్రన్న, నరేష్, పీకే రామాంజనేయులు, వెంకట్రాములు, తిక్కయ్యలు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు బొలెరో వాహనం బోల్తా పడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బొలెరో వాహనం పత్తిలోడ్‌తో ఎర్రవల్లి వైపు నుంచి రాయచూర్‌కు వెళ్తోంది. ఈ క్రమంలో జమ్మిచేడు శివారులో అదుపు తప్పి బోల్తా పడింది. వెంటనే డ్రైవరు పరారయ్యాడు. ఈ విషయంపై స్థానిక పోలీసులను 'సాక్షి' వివరణ కొరగా.. తమ దృష్టికి రాలేదని, విచారణ చేపట్టి వివరాలు వెల్లడిస్తామని ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.